# జటిలమవుతున్న కుక్కల సమస్య

- జనంపై దాడులు చేస్తున్న వీధికుక్కలు
- తెనాలిలో శస్త్రచికిత్సాలయం ఉన్నా మంగళగిరి పంపుతున్న అధికారులు
- మంగళగిరి అధికారులు విముఖత చూపటంతో ఆగిన శస్త్రచికిత్సలు


నిరుపయోగంగా మారిన తెనాలిలోని శస్త్ర చికిత్సాలయం

**తెనాలిఅర్బన్:** పట్టణంలో వీధికుక్కల సమస్య జటిలం అవుతుంది. కుక్కలు పలువురిపై దాడులు చేస్తున్న మున్సిపల్ అధికారులు వాటి నియంత్రణకు ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవటం లేదు. దీనికి ప్రధాన కారణం కొందరు బ్లూ క్రాస్ ప్రతినిధులు అధికారులను బెదిరించటమేనని సమాచారం. దీంతో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఏమి చేయలేక చేతులు ఎత్తివేస్తున్నారు.

మున్సిపల్ అధికారుల లెక్కల ప్రకారం తెనాలి పట్టణంలో 1425 వీధి కుక్కలు ఉన్నాయి. వీటి నియంత్రణ కోసం బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో గతంలో కుక్కల శస్త్ర చికిత్సాలయాన్ని నిర్మించి దానిలో సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తు వచ్చారు. ఇప్పటి వరకు అధికారులు లెక్కల ప్రకారం 830 కుక్కలకు శస్త్రచికిత్సలు చేశారు. మిగిలిన 595 కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయాల్సి ఉంది.

**రోజుకు 15 నుంచి 20 మందిపై దాడులు**

పట్టణంలోని వీధి కుక్కలు పాదచారులు, వాహనదారులపై తరచు దాడులు చేస్తున్నాయి. ఈవిషయాన్ని జిల్లా వైద్యశాలలోని గణంకాలు నిర్ధారిస్తున్నాయి. ప్రతిరోజు కుక్క కాటుకు గురై తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చి ఇంజక్షన్లు చేయించుకునే వారి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటుంది. దీనిని బట్టి చూస్తే నెలకు సుమారు 500 నుంచి 600 వరకు వీటిబారిన పడుతున్నట్లు మనకు అర్ధమౌతుంది.

**అలంకార ప్రాయం.. శస్త్రచికిత్సాలయం!**

తెనాలి పట్టణంలో వీధి కుక్కల సమస్యలను పూర్తిగా నియంత్రించాలనే ఉద్దేశంతో అధికారులు కుక్కల శస్త్రచికిత్సాలయాన్ని గతంలో నిర్మించారు. మొదట్లో దీనిలో శస్త్రచికిత్సలను వారంలో రెండు రోజులు చేస్తు వచ్చారు. తర్వాత షెడ్ పడిపోవటం ... వర్షపు నీరు ఆవరణలో చేరటం వంటి కారణాల వల్ల చాలా కాలం దీనిలో శస్త్ర చికిత్సలు నిలిపివేశారు. గతేడాది శస్త్రచికిత్సలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవటంతో కొందరు బ్లూ క్రాస్ ప్రతినిధులు ఫోన్‌లు చేసి కంపోస్ట్ యార్డులో ఎలా చేస్తారని ప్రశ్నించి.. కోర్టులో కేసులు వేస్తామని హెచ్చరించారు. దీంతో అధికారులు ఆ ప్రయత్నాన్ని విరమించారు. మంగళగిరి మున్సిపల్ అధికారులతో మాట్లాడి అక్కడకు డిసెంబర్‌లో సుమారు నాలుగు విడతలలో 100 కుక్కలను పంపి శస్త్ర చికిత్సలు చేయించారు.

ఇలా జరుగుతుండగా అక్కడి మున్సిపల్ అధికారులు తెనాలి కుక్కలను మంగళగిరి తేవద్దని ఆదేశించటంతో ఆప్రక్రియ పూర్తిగా నిలచి పోయింది. దీంతో ఏమి చేయాలనే విషయంపై అధికారులు చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

## వార్డుకు 100కు పైగా వీధి కుక్కలు


రోడ్లపై సంచరిస్తున్న వీధి కుక్కలు

తెనాలి పట్టణంలో వీధి కుక్కల సంఖ్య ఎక్కువనే చెప్పవచ్చు. ఈ విషయాన్ని స్వయంగా కౌన్సిలర్‌లు గతంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారు. వారి అంచనా ప్రకారం తెనాలి పట్టణంలోని ప్రతి వార్డులో వందకు పైగా ఉన్నాయి. అంటే 40 వార్డులలో నాలుగు వేలకు పైగా ఉంటాయనేది వారి భావన. కానీ అధికారులు మాత్రం కేవలం 1425 మాత్రమే ఉన్నాయని చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే అధికారుల లెక్కలకు, కౌన్సిలర్‌ల లెక్కలకు పొంతన లేదనే చెప్పాలి.

## వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



పట్టణంలో వీధి కుక్కల సమస్య కొంత తీవ్రంగా ఉన్న మాట వాస్తవం. వాటి నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగా మంగళగిరిలో శస్త్రచికిత్సలు చేయిస్తున్నాం. రానున్న రోజుల్లో పట్టణంలోని అన్ని కుక్కలకు శస్త్రచికిత్సలు చేయించి సంతానోత్పత్తి జరగకుండా చూస్తాం. ఇలా చేయటం వల్ల కుక్కల సంఖ్య పూర్తిగా తగ్గే అవకాశం ఉంది.

– బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

# తెనాలి మున్సిపల్ హైస్కూలు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

**తెనాలి:** మహారాష్ట్రలోని పూనేలో గల సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'నేషనల్ లెవెల్ టాలెంట్ సెర్చ్ కాంపిటీషన్ 2024–25'లో స్థానిక అయితానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో చిత్రలేఖనంలో పాల్గొన్న మన్యం బద్రీనాథ్ (పదోతరగతి), సన కౌషర్ పఠాన్ (7వ తరగతి), పిల్లి ఐశ్వర్య (6వ తరగతి)లు తమ కేటగిరీల్లో బంగారు పతకాలను సాధించి 'కళారంగ్' పురస్కారాలను అందుకున్నారు. హైస్కూలు కళావేదికపై శుక్రవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి ఈ విద్యార్థులను అభినందించారు. వారిని ప్రోత్సహించిన ప్రధానోపాధ్యాయిని సునీత, చిత్రలేఖన ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్, ప్రసూనాదేవిని ప్రశంసించారు. విద్యార్థులు స్ఫూర్తిదాయకమైన ప్రతిభను ప్రదర్శించారని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించగలరన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు.

# డ్రాప్ అవుట్స్ లేకుండా చూడండి

**మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి**


విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

**తెనాలిఅర్బన్:** ప్రభుత్వ పాఠశాలలో డ్రాప్ అవుట్‌లు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతి సూచించారు. ఐతానగర్‌లోని ఎన్‌ఎస్‌ఎస్‌ఎంహెచ్ స్కూల్‌ను శుక్రవారం అయన తనిఖీ చేశారు. ప్రతి తరగతి గదిని పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిస్టర్‌లోని సంఖ్యకు, విద్యార్థుల సంఖ్యకు ఏమైనా వ్యత్యాసం ఉందానే విషయాన్ని ఆరా తీశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దాడి ఘటనలో రౌడీషీటర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములనాయక్

**తెనాలిరూరల్:** యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో తెనాలి ఐతానగర్ కు చెందిన రౌడీషీటర్ నూతలపాటి అరుణ్‌ను టూ టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుడి అరెస్ట్ వివరాలను సీఐ కె రాముల నాయక్ తెలియజేశారు. మల్లెపాడుకు చెందిన శ్రీరామ్ రాజు పట్టణంలోని ప్రకాశంరోడ్డులో సమోసాల బడ్డీ నిర్వహించుకుంటూ ఉంటాడు. అతని భార్య లక్ష్మి నెహ్రూరోడ్డులోని హాస్పటల్ వద్ద సమోసాల బడ్డీ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం శ్రీరామ్ రాజు తన భార్య సమోసాల బడ్డీ వద్ద ఉండగా రౌడీ షీటర్ నూతలపాటి అరుణ్ వచ్చి యువకుడిని బలవంతంగా బండిపై తీసుకువెళ్లాడు. తాను పిలిచినప్పుడల్లా బండిమీద డ్రాప్ చేసేందుకు ఎందుకు రావడం లేదంటూ యువకుడు శ్రీరామ్ రాజుపై రౌడీషీటర్ అరుణ్ దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన యువకుడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు శుక్రవారం అరుణ్‌ను అదుపులోకి తీసుకొని హత్యాయత్నం కేసు నమోదు చేశారు. సత్ప్రవర్తన నిమిత్తం తహశీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నామని, రౌడీ షీటర్లు తమ ఉనికి చాటుకునేందుకు ఇలాంటి దాడులకు పాల్పడితే సహించేది లేదని సీఐ రాముల నాయక్ హెచ్చరించారు. పట్టణంలో ఏ ఘర్షణ జరిగినా ఐతానగర్ పేరు ఎక్కువగా వినిపిస్తోందని, ఐతానగర్‌లో రౌడీషీటర్లు, అల్లర్లకు పాల్పడే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎస్ఐలు అమరలింగేశ్వరరావు, హైమారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


వ్యాధుల గురించి వివరిస్తున్న డాక్టర్ జయశ్రీ

**మున్నంగి(కొల్లిపర):** రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు ఉచితంగా నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్నంగి గ్రామ పశువైద్యురాలు డాక్టర్ జయశ్రీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో ఆళ్ళ వీరారెడ్డి చేతుల మీదుగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అత్తోట గ్రామానికి చెందిన పశువైద్యురాలు డాక్టర్ సుజాత మాట్లాడుతూ పాడి రైతులు క్రమం తప్పకుండా పాడి పశువులకు టీకాలు వేయించాలన్నారు. తద్వారా వ్యాధులు నుంచి పాడి పశువులను రక్షించుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు ఎన్‌జీఆర్ఎస్ ద్వారా పాడి పశువులకు పచ్చి గడ్డి ఏవిధంగా నమోదు చేసుకోవాలి, పశువులకు మినీ గోకులం పథకం ద్వారా షెడ్లు ఏవిధంగా నిర్మించుకోవాలని అన్న అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## విధులకు సకాలంలో హాజరుకండి

**తెనాలిఅర్బన్:** విధులకు అందరూ సకాలంలో హాజరు కావాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని శానిటరీ డివిజన్‌ను శుక్రవారం తెల్లవారుజామున ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణను త్వరగా జరపాలని సూచించారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం 7,9 వార్డులలో పర్యటించి అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## రేపు క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

**తెనాలిరూరల్:** క్రికెట్‌లో ప్రతిభ కనబర్చిన ఐదుగురు క్రీడాకారులను ఎంపి చేసి, వారికి ఏడాది పాటు ఉచిత శిక్షణ, కిట్, స్కాలర్‌షిప్‌లను అందజేస్తామని పట్టణ చెంచుపేటలోని యువ క్రికెట్ అకాడమీ డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్, కోచ్ మాలిక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం వరకు క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు నేరుగా అకాడమీలో జరిగే ఎంపికలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 7989215572 నంబరులో సంప్రదించాలని కోరారు.

## కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోండి

**తెనాలిఅర్బన్:** విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ పేర్కొన్నారు. చెంచుపేటలోని నెహ్రూనికేతన్ లిటిల్ వండర్ స్కూల్‌లో శుక్రవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్ అపహరణపై కేసు

**తెనాలిరూరల్:** బైక్ అపహరణకు గురవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి గత అక్టోబరు 30న తెనాలి రైల్వేస్టేషన్ ఐదో నంబరు ప్లాట్‌ఫాం వైపును తన బైక్‌ను నిలిపి వెళ్లాడు. తిరిగి వచ్చే చూడగా వాహనం కనబడలేదు. ఇన్నాళ్లు గాలించి చివరకు పోలీసులను ఆశ్రయించగా, త్రీ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

**గేదె అపహరణ..**

గేదెను అపహరించడంపై కేసు నమోదైంది. పట్టణ బాలాజీరావుపేటలోని కాల్వకట్ట రోడ్డులో ఓ కుటుంబం గేదెలను పెంచుతూ జీవనం సాగిస్తోంది. వీరి గేదెలలో ఓ గేదెను గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 19వ తేదీ రాత్రి అపహరించుకెళ్లారు. బాధితుత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం


అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాఘవరావు

**తెనాలిరూరల్:** మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని తెనాలి మోటారువాహన ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో వాహనదారులకు పలు సచనలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగే అపరాధాలను వివరించారు. మద్యం తాగి వాహనాలను నడిపితే వాహనాలపై పట్టు కోల్పోయి ప్రమాదాలు జరుగుతాయన్నారు. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే వేల రూపాయల అపరాథ రుసుం విధించడంతో పాటు కొన్ని సార్లు డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు.

# మేడమ్... కల్వర్ట్ నిర్మించండి

**చైర్‌పర్సన్ రాధికకు 27వ వార్డు ప్రజలవినతి**


స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ అరుణ

**తెనాలిఅర్బన్:** చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం సమీపంలో కల్వర్ట్‌ను నిర్మించాలని ఆ ప్రాంతవాసులు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను కోరారు. శుక్రవారం 27, 28 వార్డుల్లో ఆమె పర్యటించారు. దీనిపై స్పందించిన ఆమె దాని నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 27వ వార్డు పరిధిలోని కొన్ని రోడ్డు విస్తరణ పనులు, మురుగు కాల్వలు నిర్మించినట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమె వెంట కౌన్సిలర్లు బోయపాటి అరుణ, యాతాటి అనిల్, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతునివ్వండి

**పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు**


లక్ష్మణరావుకు సంఘీభావం తెలియజేస్తున్న వివిధ సంఘాల నేతలు

**తెనాలి:** ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం ఇక్కడి ఎన్‌జీవో కళ్యాణమండపంలో నిర్వహించారు. సభకు యూటీఎఫ్ జిల్లా కోశాధికారి గయాసుద్దీలా అధ్యక్షత వహించారు. 2025 మార్చిలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు సంపూర్ణ మద్దతునిచ్చి అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని లక్ష్మణరావు కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ప్రజాసంఘాల కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి, సీఐటీయూ జిల్లా నాయకుడు ఎన్.భావన్నారాయణ, సీఐటీయూ జిల్లా నాయకుడు కొల్లిపర బాబూప్రసాద్, యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ టీఎస్ మల్లేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖర్, రైతుసంఘం జిలా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, యూఈఈయూ జిల్లా కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, వివిధ అసోసియేషన్ల నాయకులు జె.శ్యామ్, కె.శంకరరావు, సూర్యప్రకాశరావు, డీవీ సోమయ్యశాస్త్రి, ఏవీఎస్ కుమారి, అశోక్, వెంకటసుబ్బయ్య, ఫణీంద్ర, విశ్రాంత ఎంఈవో కుటుంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రత్యేక సదరమ్ క్యాంప్


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆషా కిరణ్

**తెనాలిఅర్బన్:** తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరమ్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఉదయం 8.30 గంటలకే వికలాంగులు జిల్లా వైద్యశాలకు చేరుకుని నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాంపు జరిగింది. 100 మంది కంటి, 49 మంది వినికిడికి సంబంధించిన పరీక్షలు చేయించుకున్నట్లు అధికారులు తెలిపారు. క్యాంప్‌లో నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఎం చంద్రబాబు, సత్తెనపల్లి నుంచి వచ్చిన డాక్టర్ మాధురిలు, బాపట్ల నుంచి వచ్చిన అప్తామాలజీ వైద్యులు డాక్టర్ ఆషాకిరణ్, నర్సారావుపేట నుంచి వచ్చిన డాక్టర్ ఎస్ హేమశ్రీలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వచ్చే వారం కూడా బుధ,గురు, శుక్ర వారాల్లో క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

# నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై తనిఖీలు


మాట్లాడుతున్న ఏవో శ్యామ్‌ల్‌పాల్, బి.నాగమల్లేశ్వరరావు

**కొల్లిపర:** దుగ్గిరాల మండలానికి చెందిన కూరపాటి చైతన్యకుమారి కొల్లిపర మండలంలో 2018 నుంచి 2022 వరకు ఎన్ఆర్జీస్ లో నిధుల చెల్లింపుల విషయంలో మెటీరియల్ కంపోనెంస్టు (సామగ్రి కొనుగోలు) విషయంలో అవకతవకలు జరిగాయని లోకాయుక్తలో ఫిర్యాదు చేయటంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీల బృంద సభ్యులు జిల్లాపరిషత్ ఏవో శ్యామ్‌ల్‌పాల్, బి.నాగమల్లేశ్వరరావులు 4 సంవత్సరాల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పద్దుల్లో నాలుగు సంవత్సరాల్లో సుమారు రూ.45 లక్షలు వ్యయం జరిగిందన్నారు. ఆయా సంవత్సరాల్లో విధులు నిర్వహించిన ఎంపీడీవో విజయ లక్ష్మణ్, ఎపీవోలు శివ, నాగరాజు, విజయకుమార్‌లు విచారణకు హాజరయ్యారు. ఆయా కాలంలో చేసిన పనులు రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించటం జరుగుతుందన్నారు. పరిశీలనలో ఎన్ఆర్జీస్ ఎంపీడీ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయంపై అవగాహన అనుభవ సదస్సు


గ్రామంలో పంటలు, విస్తీర్ణంపై రూపొందించిన పటం

**తెనాలి:** వడ్లేశ్వరంలోని కేఎల్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ పనులు అవగాహన అనుభవ కార్యక్రమం 2024–25లో భాగంగా శుక్రవారం రూరల్ మండల గ్రామం కొలకలూరులోని చిన్న రథం సెంటరులో గ్రామీణ భాగస్వామి విశ్లేషణ సదస్సు జరిపారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామంలోని వసతులు, సాగుభూమి విస్తరణ, పంటల సమస్యలు తెలిపే విధంగా చిత్రాల గీసి రైతులకు, స్థానిక విద్యార్థులకు అవగాహన కల్పించారు. కలిశెట్టి అప్పారావు, యేళ్ల రమేష్ బాబు , అల్లంశెట్టి వెంకటనాగరాజు, కేఎల్ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ పి.రత్నప్రసాద్ , హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ బి. బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు రైతులతో కలసి తాము చదివిన, తెలుసుకున్న విషయాలను ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులపై చర్చించి అవగాహన కల్పించారు. తదుపరి గ్రామంలో పంటలు, గ్రామ విస్తరణ గురించి మ్యాప్‌ను రూపొందించారు. వ్యవసాయ విద్యార్థులు కె.జయంత్, జె.సాత్విక్, ఎస్.నిఖిల్ ను కొలకలూరు వి.ఏ.ఏ నాగరాజు, గ్రామస్తులు అభినందించారు.

## నేడు ఓటరు దినోత్సవం

**తెనాలిరూరల్:** జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివార పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు తెనాలి మార్కెట్ సెంటరు నుండి వైకుంఠపురం ఆలయం వరకు 2కె రన్, 10.30 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి రామకృష్ణ కవి కళాక్షేత్రమ్ వరకు ర్యాలీ, అనంతరం అక్కడే సభ నిర్వహించనున్నట్లు వివరించారు. సభా కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజన్‌లకు సత్కారం చేయనున్నట్లు చెప్పారు. వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు.

## క్లుప్తంగా

### అర్బన్ మార్కెట్లను ఆదరించండి

**తెనాలిఅర్బన్:** అర్బన్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన వస్తువులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని తెనాలి మెప్మా సీఎంఎం విజయ కుమారి కోరారు. మెప్మా విభాగం ఆధ్వర్యంలో మున్సిపల్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ శుక్రవారంతో ముగిసింది. స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను అర్బన్ మార్కెట్‌లో విక్రయించారు. పెద్ద సంఖ్యలో పట్టణవాసులు అక్కడకు వచ్చి వాటిని కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

### స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో పాల్గొనండి



**తెనాలిఅర్బన్:** స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని 13వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కుర్రా సుజాత కోరారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని 13వ వార్డులో శుక్రవారం నిర్వహించారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి పట్టణంలో చెత్తను మూడు రకాలుగా సేకరించడం జరుగుతుందన్నారు. అందరూ ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను గ్రేడింగ్ చేసి కార్మికులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, ఎన్.ప్రవీన్, జి.చంద్రశేఖర్, డి.సాగర్, కె.సంధ్య, ఎం.శాంతి, జె.హవీల పాల్గొన్నారు.

### తెనాలి విద్యార్థినికి బంగారు పతకం



**తెనాలి:** నేపాల్‌లో ఇటీవల జరిగిన ఇండో–నేపాల్ జంప్ రోప్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక బుర్రిపాలెంలోని వెస్ట్ బెర్రీ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కె.యుక్తాశ్రీ విశేష ప్రతిభను ప్రదర్శించింది. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పోటీల్లో ఎల్ఆర్ఎస్ గ్రూప్ ఈవెంట్‌లో బంగారు పతకాన్ని సాధించింది. 20 సెకన్ల డబుల్ అండర్ ఈవెంట్‌లోనూ కాంస్య పతకాన్ని గెలుచుకోవటం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సుబ్రహ్మణ్యం శుక్రవారం యుక్తాశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. కఠినమైన శ్రమ, అంకితభావంతోనే ఈ విజయం సాధించిందనీ, తన విజయం స్ఫూర్తిదాయమని అన్నారు. యుక్తాశ్రీని, తనకు శిక్షణనిచ్చిన క్రీడాకోచ్‌ను కో–ఆర్డినేటర్ మృత్యుంజయ్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

### బాలికలు మానసికంగా దృఢంగా ఉండాలి



**కొల్లిపర:** సమాజంలో బాలికలపై, మహిళలపై జరుగుతున్న దారుణాలను అరికట్టాలి అంటే బాలికలు చిన్న వయసు నుంచి మానసికంగా దృడంగా ఉండాలని అప్పుడే ఎటువంటి సంఘటనలైనా ధైర్యంగా ఎదుర్కోవటం జరుగుతుందని డాక్టరు కాటా ప్రమీల సాంబిరెడ్డి అన్నారు.శుక్రవారం కొల్లిపర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రాయపాటి శివనాగేశ్వరరావు, ఈదా సాంబిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బిట్రా వెంట్రూరావు, కసుకుర్తి ప్రశాంతరావు, కె.వెంకట భూపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల హాజరు తనిఖీ



**తెనాలిరూరల్:** మండలంలోని అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరును ఎంఈవో జయంతిబాబు శుక్రవారం తనిఖీ చేశారు. తరగతుల వారీగా హాజరు పట్టికలను పరిశీలించి ఆన్‌లైన్ రోల్‌కు హాజరు పట్టికలలో ఉన్న రోల్‌కు హాజరు వ్యత్యాసం ఉందా అన్న అంశాన్ని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల్లో ఉన్న సందేహాలు నివృత్తి చేయడంతో పాటు ఏవిధంగా చదవాలో అనే విషయం పై పలు సూచనలు చేశారు. పాఠశాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, అంగలకుదురు సచివాలయం-2 సిబ్బంది పాల్గొన్నారు.